బ్రాడ్‌బ్యాండ్ వైర్‌లెస్ యాక్సెస్ స్పెక్ట్రమ్ - 4 జి స్పెక్ట్రమ్

2010లో బిడబ్ల్యుఎ స్పెక్ట్రమ్‌కు వేలం జరిగినపుడు దేశవ్యాప్త లైసెన్సును బిఎస్ఎన్ఎల్ మరియు ఇన్‌ఫోటెల్ మాత్రమే పొందాయి. తదనంతరం ఇన్‌ఫోటెల్‌ను రిలయన్సు ఇండస్ట్రీస్ లిమిటెడ్ కొనుగోలు చేసింది. అమెరికాకు చెందిన క్వాల్‌కాం నాలుగు సర్కిళ్ళు, ఎయిర్‌టెల్, ఎయిర్‌సెల్, టికోనా మరియు ఆగిలే కంపెనీలు వరుసగా 2, 4, 4, 1 సర్కిళ్ళు పొందాయి. దేశవ్యాప్త పాన్ ఇండియా లైసెన్సు కోసం బిఎస్ఎన్ఎల్, ఇన్‌ఫోటెల్ (రిలయన్సు) దాదాపు 8300 కోట్లు చెల్లించాయి.

అయితే ఇతర అన్ని ప్రైవేటు టెలికం కంపెనీలకు 2.3 GH_z బ్యాండ్‌లో స్పెక్ట్రమ్ ఇవ్వగా, బిఎస్ఎన్ఎల్‌కు మాత్రం 2.6 GH_z బ్యాండ్‌లో స్పెక్ట్రమ్ ఇచ్చారు. బిఎస్ఎన్ఎల్‌కు ఇచ్చిన 2.6 GH_zలో వైమాక్సు టెక్నాలజీతో ప్రసారాలు జరగాలంటే కావాల్సిన సాంకేతిక పరికరాలు ప్రపంచవ్యాప్తంగా ఇంకా తయారుకావాల్సి వుంది. అందుబాటులో వున్న పరికరాలతో ఈ బ్యాండ్‌లో ప్రసారాల సామర్థ్యం కూడా అంత బాగా వుండదు. కాగా ప్రైవేటు టెలికం కంపెనీలకు ఇచ్చిన బ్యాండ్ విడ్త్ వాడకం వల్ల అత్యాధునిక లాంగ్‌టర్మ్ ఎవల్యూషన్ ద్వారా తక్కువ ఖర్చుతోనే ఉన్నత సాంకేతిక ప్రసారాలు నిర్వహించవచ్చు.

గ్రామీణ ప్రాంతాలలో వైమాక్సు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇంటర్నెట్ ప్రసారాలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఉద్దేశ్యాలకు, బిఎస్ఎన్ఎల్‌కు ఇచ్చిన బ్యాండ్ విడ్త్ ద్వారా చేయడం సాధ్యం కాదు. ఈ రకంగా గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడని, పట్టణ ప్రాంతాలలో పోటీకి విలువ లేని బిడబ్ల్యుఎ స్పెక్ట్రమ్‌ను బిఎస్ఎన్ఎల్‌కు ఇచ్చారు. కనుకనే 4 సర్కిళ్ళు తప్ప మిగతా సర్కిళ్ళలో స్పెక్ట్రమ్‌ను తిరిగి డిఓటికి ఇవ్వాలని బిఎస్ఎన్ఎల్ నిర్ణయించింది. దీనికి డిఓటి కూడా అంగీకరించింది.

తమకు అలాట్ చేసిన ఉన్నత ప్రమాణాలుగల బ్యాండ్ విడ్త్ ద్వారా 4జి సర్వీసులను త్వరలో ప్రారంభించాలని రిలయన్సు ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆలోచిస్తోంది. ఈ 4జి సర్వీసుల ద్వారా 50-100MBPS స్పీడ్‌తో నెట్‌ను ఇవ్వడం సాధ్యమవుతుంది. 3జి సర్వీసుల నెట్ వేగం కన్నా ఇది మూడింతలు వేగంతో పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా 4జి సర్వీసులను ఇవ్వడం కోసం రాబోయే రెండేళ్ళలో 25,000 కోట్లను రిలయన్సు ఖర్చు చేస్తోంది. వేగవంతంగా వీడియో, సమాచార మార్పిడి, కంప్యూటర్లు/టాబ్లెట్ పిసిలు, మొబైల్‌లలో, మరియు ప్రకటనల రూపంలో ఈ సర్వీసులను అభివృద్ధి చేయాలని రిలయన్సు ప్రయత్నం. రిలయన్సు ఇండస్ట్రీస్ లిమిటెడ్ అధినేత శ్రీ ముఖేష్ అంబానీ, రిలయన్సు కమ్యూనికేషన్స్ అధినేత తమ్ముడు అనిల్ అంబానీతో కలిసి ఈ సర్వీసులను నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. నెట్‌వర్కు 18లో పెట్టుబడుల ద్వారా, టెలివిజన్, ఇంటర్నెట్ ద్వారా అన్ని భాషలలో అడుగుపెట్టాలని రిలయన్సు ఇండస్ట్రీస్ ప్రయత్నం. వాల్ట్‌డిస్నీ ఇండియాకు చెందిన 'యుటివి'లాంటి వినోదాత్మక కంపెనీల ద్వారా ఆన్‌లైన్ గేమ్స్, స్కూలు విద్య, నెట్ ద్వారా విద్యను కూడా రిలయన్సు ప్రయత్నిస్తోంది. 10 పైసలకే 1 GB డాటా ట్రాన్స్‌ఫర్ ఇవ్వడం ద్వారా ప్రస్తుతం వున్న 3జి రేట్లలో 1/10వ వంతు రేటుకే పై పనుల నిర్వహణ చేయాలని రిలయన్సు కోరిక. అయితే టాబ్లెట్ పర్సనల్ కంప్యూటర్లను గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ విధానం ద్వారా రూ. 3000-8000 మధ్యలో అందించాలని కూడా రిలయన్సు అనుకుంటోంది.

ఎయిర్‌టెల్, వొడాఫోన్, క్వాల్‌కాం, ఎయిర్‌సెల్, టికోనా లాంటి ఇతర కంపెనీలు కొన్ని సర్కిళ్ళలో మాత్రమే బిడబ్ల్యుఎ స్పెక్ట్రమ్ (4జి) పొందాయి. ఈ కంపెనీలు 3జి స్పెక్ట్రమ్‌లో కూడా కొన్ని సర్కిళ్ళలో మాత్రమే 3జి స్పెక్ట్రమ్‌కు లైసెన్సు పొందాయి. అయితే లైసెన్సు సూత్రాలను ఉల్లంఘించి తమలో తాము ఒప్పందం చేసుకొని ఈ కంపెనీలన్నీ

తమకు లైసెన్సులు లేని సర్కిళ్ళలో కూడా 3జి సర్వీసులు ఇస్తున్నాయి. ఈ విషయంపై బిఎస్ఎన్ఎల్‌లోని యూనియన్లు/ అసోసియేషన్ల జెఎసి కంప్లైంట్ ఇవ్వడంతో డిఓటి టెలికం కంపెనీలకు నోటీసు ఇచ్చింది. అయితే ఈ ప్రైవేటు టెలికం కంపెనీలన్నీ టెలికం డిస్ప్యూట్స్ సెటిల్‌మెంట్ & అప్పిలేట్ ట్రిబ్యునల్ (టిడిఎస్ఎటి)కు వెళ్ళి స్టే తెచ్చుకొన్నాయి.

3జి స్పెక్ట్రమ్ సర్వీసుల విషయంలో చేసినట్లుగానే 4జి సర్వీసుల విషయంలో కూడా ఒప్పందం చేసుకొని, లైసెన్సులు లేని సర్కిళ్ళలో కూడా 4జి సర్వీసులు ఇవ్వవచ్చని ప్రైవేటు టెలికం కంపెనీలు భావించాయి. టిడిఎస్ఎటిలో 3జి సర్వీసులు అక్రమమని తేలిన పక్షంలో 4జి సర్వీసులను కూడా ఈ టెలికం కంపెనీలు ఇవ్వరాదు.

మరికొద్ది నెలలలో అమలులోకి రాబోయే నూతన టెలికం విధానపు ముసాయిదాలో ఈ రకమైన స్పెక్ట్రమ్ షేరింగ్‌కు అంగీకరిస్తూ ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల ఒత్తిడికి లొంగి విధానాల మార్పుకు అంగీకరిస్తోంది. ఈ అంశంపై ఒక అంగీకారం రాకుండా నూతన టెలికం విధానం రాదని అర్థం చేసుకోవచ్చు. దేశవ్యాప్త 4జి లైసెన్సు గల రిలయన్సుకు అడ్డం లేకుండా బిఎస్ఎన్ఎల్‌కు చెత్త స్పెక్ట్రమ్ ఇచ్చి కావాలనే ప్రభుత్వం మోసం చేసింది. 4జి సర్వీసు యుద్ధం ప్రారంభం కావడానికి ఈ క్రింది అంశాలు తేలవలసి వుంది.

ఎ) 4 సర్కిళ్ళు మినహా బిఎస్ఎన్ఎల్ 4జి సర్వీసులు ఇవ్వలేదు కనుక బిడబ్ల్యుఎ స్పెక్ట్రమ్ లైసెన్సు ఫీజును తొందరగా రాబట్టుకోవాలని బిఎస్ఎన్ఎల్ ప్రయత్నం.

బి) ఈ సంవత్సరాంతానికి దేశవ్యాప్తంగా 4జి సర్వీసులను ప్రారంభించాలని రిలయన్సు ఇండస్ట్రీస్ ప్రయత్నం.

సి) ఎయిర్‌టెల్, వొడాఫోను లాంటి కంపెనీలు 3జి సర్వీసుల లాగానే 4జి సర్వీసులను ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాయి.

డి) నూతన టెలికం విధానంలో రెవెన్యూ షేరింగ్, లైసెన్సు, సర్వీసుల నిర్వహణ షేరింగ్ పద్ధతిలో 3జి / 4జి సర్వీసులు ఇవ్వాలని కంపెనీల ప్రయత్నం.

ఇ) పై ప్రయత్నాలను రిలయన్సు ఇండస్ట్రీస్ అడ్డుకుంటుంది.

ఎఫ్) బిఎస్ఎన్ఎల్ / ఎంటిఎన్ఎల్‌లోని అన్ని ట్రేడ్ యూనియన్లు కూడా అక్రమ లైసెన్సు ఉల్లంఘనలను అడ్డుకోవడానికి పోరాడుతూనే వున్నాయి.